క్లుప్తంగా

పార్టీ వీడితే తరిమి కొట్టండి

- తాండూరులో విజయం తథ్యం
- కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డి



ఇందూరులో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

పెద్దేముల్: తాండూరులో తన గెలుపు.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం ఖాయమని ఆపార్టీ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని ఇందూరు, కందనెల్లితండా, బుద్దారంతో పాటు పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుయ్యని మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ తూచా తప్పకుండా అమలు చేస్తుందన్నారు. తన జీవితాంతం తాండూరు ప్రజలకు సేవ చేస్తానని, కాంగ్రెస్‌ను వీడితే తరిమి కొట్టాలన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్, జిల్లా మహిళ అధ్యక్షురాలు శోభారాణి, పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్, మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, పార్టీ ఏ– బ్లాక్ ప్రెసిడెంట్ నర్సింహులు, మాజీ ఎంపీపీ వాణీశ్రీ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాకేష్‌మహరాజ్, సీనియర్ నాయకులు నరేందర్ సేట్, మైపాల్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఉత్తమ్ చంద్, సుజాత, బంద్యప్ప, రియాజ్, గోపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

ఆర్థిక సహాయం

యాలాల: అచ్యుతాపూర్ గ్రామానికి చెందిన బుడిగజంగం పుల్లప్ప, హరిజన్ రమేష్‌లు మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి.. సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి ద్వారా బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయంగా రూ.10వేలను అందజేశారు. మాజీ సర్పంచ్ లక్ష్మప్ప, నాయకులు రాజేందర్‌రెడ్డి, గుణాకర్‌రెడ్డి, వెంకటయ్య, ఆశప్ప, కిష్టప్ప, శ్యాం తదితరులు ఉన్నారు.

ప్రసాద్‌కుమార్ ఓడితే రాజకీయ సన్యాసమే

మోమిన్‌పేట: కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ అసెంబ్లీ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్ ఓడితే రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఆ పార్టీ సీనియర్ నాయకుడు నరోత్తంరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధి చీమల్‌దరిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. రెండు పర్యాయాల్లో బీఆర్‌ఎస్ తరపున ప్రచారం చేసి, ఆ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేశానన్నారు. ఎమ్మెల్యే ఆనంద్‌తో ఏర్పడిన విభేదాల వలన కాంగ్రెస్‌లో చేరారని పేర్కొన్నారు. ప్రసాద్‌కుమార్ విజయానికి కృషి చేస్తానని చెప్పారు.

బుయ్యని కోసం..



ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే కుటుంబీకులు

బషీరాబాద్: కాంగ్రెస్ పార్టీ తాండూరు అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి తరుపున మాజీ ఎమ్మెల్యే నారాయణరావు కుటుంబ సభ్యులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. మంగళవారం నారాయణరావు కుమారుడు రోహిత్, కోడలు నవ్య బషీరాబాద్‌లో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు జరుగుతుందని చెప్పారు. పార్టీ అధికారంలోకి వస్తే అర్హులందరికీ ఆరు గ్యారంటీలు అందజేస్తామని చెప్పారు. ఎంపీటీసీ రేఖ, సిద్దు ఉన్నారు.

కాంగ్రెస్ వస్తే ఆగమైతం

- అధికారం కోసం 'హస్తం' తహతహ
- అమలు సాధ్యం కాని హామీలతో కుట్ర
- ఏమీ చేయని వారికి అవకాశం ఎందుకు ఇవ్వాలి
- అభివృద్ధిని కాంక్షించే బీఆర్‌ఎస్‌ను ఆదరించండి
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ఆనంద్



మోమిన్‌పేట: చంద్రాయన్‌పల్లి ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

మోమిన్‌పేట: 'తెలంగాణ ఏర్పడక ముందు పల్లెలు ఎలా ఉండేవో మీకందరికీ తెలుసు. రాష్ట్రం ఏర్పడిన తరువాత గ్రామాలు ఎంత సుందరంగా మారాయో మీరే చూస్తున్నారు. ఆరు దశాబ్దాల కాలం పాటు దేశాన్ని పరిపాలించిన కాంగ్రెస్.. మనకు ఒరగబెట్టిందేమీ లేదు. అలాంటి వారు మరోసారి అవకాశం ఇవ్వాలంటూ వస్తున్నారు. ఇంతకాలం ఏమీ చేయని వారు.. ఇప్పుడు ఏం చేస్తారు? వారికి ఓటు ఎందుకు వేయాలో ఆలోచించాలి. కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే ఆగమైతం' అని బీఆర్‌ఎస్ వికారాబాద్ అసెంబ్లీ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. ఎన్నికల పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం మండల పరిధి దుర్గంచెర్వు, మొరంగపల్లి, చంద్రాయన్‌పల్లి, కాస్లాబాదు, బూర్గుపల్లి, రాళ్లగుడుపల్లి, లచ్చానాయక్ తండాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనంద్ మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో తాగు, సాగునీరు కటకట, కరెంటు కష్టాలు, రైతుల ఆత్మహత్యలు ఉండేవని, కానీ ఇప్పుడవేమీ లేవన్నారు.

నిరంతరం విద్యుత్

మిషన్ భగీరథ, మిషన్ కాకతీయతో ముఖ్యమంత్రి కేసీఆర్ నీటి సమస్య తీర్చారని ఎమ్మెల్యే తెలిపారు. కోతలు లేని విద్యుత్ సరఫరా చేస్తూ.. సకల జనుల కష్టాలు దూరం చేశారని పేర్కొన్నారు. నాడు రైతులు మృతి చెందినా, ఆత్మహత్యలు చేసుకున్నా చిల్లిగవ్వ ఇవ్వని కాంగ్రెస్ కావాలా? నిత్యం అన్నదాతలు, వారు పండించిన ధాన్యం మద్దతు ధర గురించి ఆలోచించే బీఆర్‌ఎస్ కావాలో ఓటు రూపంలో తేల్చుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ కుట్ర

అన్ని విధాల తెలంగాణను అభివృద్ధి చేసుకున్న తర్వాత మళ్లీ రాష్ట్రంపై కాంగ్రెస్ కన్ను పడిందని, అమలు సాధ్యం కాని హామీలు ఇస్తూ.. ఎలాగైన అధికారం దక్కించుకోవాలని కుట్ర చేస్తుందని ఎమ్మెల్యే ఆనంద్ ఆరోపించారు. అభివృద్ధిని కాంక్షించే బీఆర్‌ఎస్ పార్టీని బలపరుస్తూ.. కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచులు అంజయ్య, సత్యమ్మ, సంగమ్మ, సావిత్రమ్మ, ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్, మాజీ అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి, మండల యువత అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు గోవర్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలే పార్టీకి రక్ష

ధారూరు: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో



ధారూరు: ప్రచారం చేస్తున్న గులాబీ శ్రేణులు

తెలంగాణ బంగారు మయంగా మారిందని సర్పంచ్ చంద్రమౌళి, మాజీ కోఆప్షన్ సభ్యుడు హఫీజ్ అన్నారు. ఎన్నికల పర్యటనలో భాగంగా వారు పార్టీ శ్రేణులతో కలిసి మంగళవారం ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడారు. అధికార పార్టీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామ రక్ష అని, సంక్షేమ ఫలాలతో రాష్ట్ర ప్రజలు ఆనందంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి, వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే ఆనంద్‌ను మరోసారి గెలిపించాలని అభ్యర్థించారు.

ప్రభుత్వ పాలన మోసపూరితం

- హామీల అమలులో పూర్తిగా విఫలం
- నిరుద్యోగ జీవితాలతో చెలగాటం
- కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం
- పార్టీ పరిగి అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: 'బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం చేసింది. ఇచ్చిన హామీలు అమలు చేయక అన్ని వర్గాలను మోసం చేసింది. ఉద్యోగ కల్పనలో చేతులెత్తేసి నిరుద్యోగాన్ని పెంచి పోషించింది. యువత జీవితాలతో చెలగాటం ఆడింది' అని కాంగ్రెస్ పార్టీ పరిగి అసెంబ్లీ అభ్యర్థి టి.రామ్మోహన్‌రెడ్డి అధికార పార్టీపై ధ్వజమెత్తారు. ఎన్నికల పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం మండల పరిధి మంచన్‌పల్లి, గట్టుపల్లి, తుర్క ఎన్కేపల్లి, నిజాంపేట్, మేడిపల్లి, చింతల్‌పల్లి, కంకల్, పుడుగుర్తి, పెద్ద ఉమ్మెంతాల్, బార్లపల్లి, రేగడిమామిడిపల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మోసపూరిత అధికార పార్టీని ప్రజలు నమ్మేస్థితిలో లేరని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటువేసి ఆ పార్టీని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

ఇందిరమ్మ పాలనలో ఇండ్లు

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణ మాఫీ చేయడంతో పాటు ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని టీఆర్‌ఆర్ చెప్పారు. కాంగ్రెస్ పాలనలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, ఆరోగ్య శ్రీ ద్వారా ఖరీదైన వైద్యం అందిందని తెలిపారు. మరోసారి ఇందిరమ్మ పాలన రావాలంటే చేతి గుర్తుకు ఓటువేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని ఆయన కోరారు. పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆనందం, డీసీసీ కార్యదర్శులు శ్రీనివాస్, పెంటయ్య, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, మహిళా అధ్యక్షురాలు బాలమణి, వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

అన్నివర్గాలకు మేలు

కుల్కచర్ల: కాంగ్రెస్ గెలిస్తేనే నిరుపేదకు మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే అభ్యర్థి టి.రామ్మోహన్‌రెడ్డి కూమార్తె మేఘనా రెడ్డి అన్నారు. మండల పరిధి కుల్కచర్ల, ముజాహిద్‌పూర్‌లో ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మేఘన మాట్లాడారు. బీఆర్‌ఎస్ నియంతృత్వ పాలనలో నిరుద్యోగులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందిని ఎదుర్కొన్నారని ఆరోపించారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పారు. అధికార పార్టీ నాయకుల మాటలు నమ్మకుండా.. చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, ఎంపీటీసీ ఆనందం, జిల్లా రజక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, నాయకులు రాంరెడ్డి, కృష్ణయ్య, జావీద్, ఎల్లయ్య, మురళి ఉన్నారు.



పూడూరు: ప్రచారం చేస్తున్న రామ్మోహన్‌రెడ్డి



కుల్కచర్ల: ఇంటింటి ప్రచారంలో మేఘనా రెడ్డి

ఓటరు ఇంటికి పోల్-చీటీ



పోల్‌చీటీలను పంపిణీ చేస్తున్న బీఎల్‌ఓలు

- బీఎల్‌ఓల ద్వారా నేరుగా పంపిణీ
- భయం లేకుండా ఓటు వేయాలంటూ స్లిప్ వెనకాల సూచన

దౌల్తాబాద్: శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఓటర్లకు పోలింగ్ స్లిప్పులను పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఈసీ ఆదేశాల మేరకు బీఎల్‌ఓలు ఓటరు ఇంటికి వెళ్లి నేరుగా ఓటింగ్ స్లిప్‌లను అందజేస్తున్నారు. ఈ నెల 23వ తేదీలోగా పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు.

పలు సంస్కరణలకు శ్రీకారం..

ఓటర్లను చైతన్య పరిచేందుకు ఎన్నికల సంఘం పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. మునపటి సాధారణ ఎన్నికల సమయంలో ఓటర్లకు పోల్ చీటీలు మాత్రమే పంపిణీ చేశారు. కానీ ఇప్పుడు చీటీతో పాటు పలు సూచనలతో కూడిన మూడు పేజీల ఓటరు గైడ్‌ను పంపిణీ చేస్తున్నారు. ఓటరు జాబితాలో పేరు నమోదు, తనిఖీ చేసుకునేందుకు అవసరమైన వెబ్‌సైట్, ఆన్‌లైన్ నమోదు, తపాల బ్యాలెట్ విధానం గురించి ఇందులో పొందుపరిచారు. ఓటు వేయడానికి వెళ్లే ముందు పాటించాల్సిన సూచనలు, పోలింగ్ కేంద్రాల్లో ఐదు దశల్లో పోలింగ్ ప్రక్రియ, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో ఓటు వేసే విధానం, ఎన్నికల సమయంలో ఎవరైనా అభ్యర్థులు మద్యం, డబ్బులు పంపిణీ చేస్తే సివిజిల్ యాప్, 1950 టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారం అందించాలని సూచిస్తున్నారు.

ఓటరు ఇంట్లో లేకుంటే..

ఎన్నికల సిబ్బంది ఓటరు ఇంటికి వెళ్లిన సమయంలో ఓటరు అందుబాటులో లేని యెడలా.. ఓటింగ్ రోజున సంబంధిత పోలింగ్ కేంద్రం వద్ద అందుబాటులో ఉంచుతారు. వారితో పాటు చిరునామాలో లేని వారివి, డూప్లికెట్‌గా భావించినవి అక్కడే ఉంటాయి. తగిన ఆధారం చూపి ఓటర్ స్లిప్‌ను పొందవచ్చు. చీటీ లేకపోయినా ఈసీ పేర్కొన్న 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి చూపించి ఓటరు జాబితాలో పేరుంటే ఓటు వేయవచ్చు.

గోడలపై చెరగని పోస్టర్లు!

దోమ: ఎన్నికల నిబంధనలు రాజకీయ పార్టీల ఉల్లంఘిస్తున్నాయి. ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్లి.. గోడలకు, తలుపులకు ప్రచార స్టిక్కర్లు, పోస్టర్లను అతికిస్తూ.. ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇంకా కొన్ని పార్టీలకు చెందిన వారు గోడలకు పోస్టర్లు అతికిస్తున్నా.. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా మండల కేంద్రంలోని వ్యాపార సముదాయాలు, ఇంటి గోడలపై కొన్ని పార్టీలకు చెందిన అభ్యర్థుల ఫొటోలతో కూడిన వాల్ పోస్టర్లు దర్శనం ఇస్తున్నాయి. ఇది గమనించిన ఇతర పార్టీల వారు అధికారుల తీరుపై మండి



దుకాణ సముదాయ గోడకు అతికించిన పోస్టర్

పడుతున్నారు. ఆ పార్టీల నేతలకు ఎన్నికల నిబంధనలు వర్తించవా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఆయా పోస్టర్లను తొలగించి, అందరికీ ఒకే రూల్ వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



తాండూరు టౌన్: ఇంటింటి ప్రచారం చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప తదితరులు

- కాంగ్రెస్ మాయ మాటలు నమ్మకండి
- బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించి, అభివృద్ధిని ఆస్వాదించండి
- ఇంటింటి ప్రచారంలో గులాబీ శ్రేణులు



తాండూరు టౌన్: 35వ వార్డులో..

తాండూరు టౌన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అధికార పార్టీ నాయకులు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప, మాజీ కౌన్సిలర్ సావిత్రమ్మ, నాయకులు పట్లోళ్ల నర్సింహులు ఆధ్వర్యంలో సాయిపూర్ నుంచి గులాబీ శ్రేణులు భారీగా ర్యాలీ నిర్వహించారు. సాయిపూర్, ఇందిరాచౌక్, గంజ్, గాంధీచౌక్, భద్రేశ్వర్ చౌక్‌ల మీదుగా అంబేడ్కర్ చౌక్ వరకు ర్యాలీ తీశారు. అదే విధంగా పాత తాండూరు 16,18వ వార్డుల్లో ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి సోదరుడు రితీష్ రెడ్డి, 35వ వార్డులో పార్టీ నాయకుడు సంతోష్‌కుమార్ ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణ మరింత అభివృద్ధి చెందాలన్నా.. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులకు అందాలన్నా బీఆర్‌ఎస్ పార్టీని ఆదరించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పే మోసపూరిత మాటలను నమ్మరాదని, ఈ అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.

కారెక్కిన కాంగ్రెస్ శ్రేణులు

తాండూరు రూరల్: కాంగ్రెస్ పార్టీకి చెందిన 150 మంది కార్యకర్తలు మంగళవారం అధికార పార్టీలో చేరారు. తాండూరు మండలం గోనూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మాచనూర్ సతీష్‌తో పాటు భారీగా ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి నివాసంలో పార్టీలో చేరగా.. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సతీష్, సంజీవ్‌రెడ్డి, బాలరాజు, అంతప్ప, సునిత తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు కరణం పురుషోత్తంరావులు ఉన్నారు.

ఎమ్మెల్యేతోనే అభివృద్ధి

జిల్లాలోనే మేజర్ గ్రామ పంచాయతీ అయిన కరన్‌కోట్ అభివృద్ధికి ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఎనలేని కృషి చేశారని ఉప సర్పంచ్ హేమంత్‌కుమార్ అన్నారు. గ్రామంలో పార్టీ కార్యకర్తలతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తి పైలెట్ అని, ఈ అసెంబ్లీ ఎన్నికల్లో రోహిత్‌ను మరోసారి గెలిపించాలని కోరారు.

తాండూరులో కాంగ్రెస్ కతం

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

పెద్దేముల్: ఈ అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరులో కాంగ్రెస్ పార్టీ నామ రూపాలు లేకుండా పోతుందని బీఆర్‌ఎస్ పార్టీ తాండూరు అభ్యర్థి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. మండల పరిధి ఆత్కూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ప్రభుతో పాటు పలు గ్రామాలకు చెందిన నాయకులు అధికార పార్టీలో చేరగా.. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడారు. సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రజలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని వెల్లడించారు. పల్లెలు, ప్రజలు తెలియని ప్రతిపక్ష నాయకులకు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మూడోసారి సారి ముఖ్యమంత్రిగా కేసీఆర్.. రెండోసారి ఎమ్మెల్యేగా నేను గెలవడం ఖాయమని పైలెట్ ఆశాభావం వ్యక్తంచేశారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే

కేసీఆర్ చేతిలో తెలంగాణ బందీ



మర్పల్లి: బూచన్‌పల్లిలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- దశాబ్ద కాలంగా రాష్ట్రాన్ని దోస్తున్న కల్వకుంట్ల కుటుంబం
- బీఆర్‌ఎస్‌కు చరమగీతం పాడదాం.. కాంగ్రెస్‌ను గెలిపించుకుందాం
- ఇంటింటి ప్రచారంలో హస్తం శ్రేణులు

మర్పల్లి: అమరుల త్యాగాలతో సాధించుకున్న తెలంగాణ.. కేసీఆర్ కుటుంబం చేతిలో బందీ అయిందని, తెలంగాణ తల్లిని విడిపించుకునే సమయం ఆసన్నమయిందని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామేశ్వర్ అన్నారు. మర్పల్లి మండలం బూచన్‌పల్లి గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవిందర్, ఎంపీటీసీ బాల్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకట్‌రామ్‌రెడ్డితో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అమరుల త్యాగానికి చలించిన కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ తెలంగాణను ఇచ్చి, రాష్ట్ర ప్రజల కలను సాకారం చేసిందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్‌ను గెలిపించి తెలంగాణను సోనియాకు బహుమానంగా ఇవ్వాలని సూచించారు. దశాబ్ద కాలంగా కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని దోస్తుందని విమర్శించారు. మాయమాటలతో అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కల్వకుంట్ల కుటుంబం కబంధ హస్తాల నుంచి తెలంగాణకు విముక్తి కల్పించాలంటే ఈ అసెంబ్లీ ఎన్నికల్లో చేతికి గుర్తుకు ఓటువేసి, మాజీమంత్రి ప్రసాద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలతో పాటు, మేనిఫెస్టోను అమలు చేయనున్నారని వెల్లడించారు. పార్టీ మండల అధ్యక్షుడు రవిందర్, ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ బాల్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకట్‌రామ్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహ్మారెడ్డి, ఉప సర్పంచ్ రాములు, సీనియర్ నాయకులు సుదర్శన్, బలవంత్‌రెడ్డి, బిచ్చిరెడ్డి, రఘుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రంగయ్య, గోపాల్ తదితరులు ఉన్నారు.

ఏం చేశారో చెప్పండి..

ధారూరు: ఐదేళ్ల పదవిలో ఉన్న ఎమ్మెల్యే ఆనంద్.. నియోజకవర్గానికి ఏమి చేశారో చెప్పి, ప్రజలను ఓట్లు అడగాలని బీఆర్‌ఎస్ నాయకులకు ప్రతిపక్ష కాంగ్రెస్ నేతలు సూచించారు. ఎన్నికల పర్యటనలో భాగంగా హస్తం శ్రేణులు తిమ్మానగర్‌లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం అయిందని, వికారాబాద్‌కు ఎమ్మెల్యే ఆనంద్ చేసిందేమీ లేదని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అందరికీ మేలన్నారు. పార్టీ ప్రకటించిన మేనిఫెస్టో బాగుందని, కావున చేతి గుర్తుకు ఓటువేసి ప్రసాద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ప్రచారంలో పార్టీ నాయకులు మహ్మద్ బాబాఖాన్, బుజ్జయ్యగౌడ్ లింగన్‌పల్లి అశోక్, ఇబ్రహీం, కిరణ్ కుమార్, మల్లేశం, అంజయ్య, దావూద్, రాజేశ్వర్, ఇనాయతుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో మాజీ సర్పంచ్ చేరిక

బంట్వారం: తొర్మామిడి మాజీ సర్పంచ్ మొగులయ్య మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా.. ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మొగులయ్య మాట్లాడారు. ప్రసాద్‌కుమార్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. ఎంపీపీ ప్రభాకర్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశం, డీసీసీ ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, నాయకులు మొగులయ్య, రాములు, యాదగిరి, పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్ ఉన్నారు.



పార్టీలో చేరిన వారితో ప్రసాద్‌కుమార్

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

అనంతగిరి: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ వికారాబాద్ మండలం అధ్యక్షుడు కమాల్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆయన మంగళవారం వికారాబాద్ మండలం బురాన్‌పల్లిలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ హాట్రిక్ సాధిస్తారని ధీమా వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే ఆనంద్‌కు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఇందులో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, సీనియర్ నాయకులు నర్సింహరెడ్డి, అనంత్‌రెడ్డి, సాయిగౌడ్, కమాల్‌రెడ్డి, అనిల్ తదితరులు ఉన్నారు.

అధికార పార్టీకే మద్దతు

తాండూరు టౌన్: బీసీలకు ప్రాధాన్యత ఇస్తున్న బీఆర్‌ఎస్ పార్టీకే ముదిరాజుల మద్దతు ఉంటుందని అఖిల భారత ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేశ్ అన్నారు. మంగళవారం ఆయన తాండూరులో మాట్లాడారు. ముదిరాజులను బీసీ (డి) నుంచి బీసీ (ఏ) జాబితాలో చేర్చేందుకు కృషి చేస్తానని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని తెలిపారు. నేడు తాండూరులో జరగనున్న సీఎం సభకు కాసాని జ్ఞానేశ్వర్ హాజరవుతారని వెల్లడించారు. ఇందులో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉమాశంకర్ ఉన్నారు.

ఓటు వజ్రాయుధం

కుల్కచర్ల: ఓటు వజ్రాయుధం అని, ప్రతి ఒక్కరూ తమ హక్కును వినియోగించుకోవాలని తిర్మలాపూర్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కుల్కచర్ల మండలం తిర్మలాపూర్ గ్రామంలో ఓటర్లకు ఓటరు స్లిప్పులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 30న జరగనున్న ఓటింగ్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

ప్రచార ర్యాలీలో తేనెటీగల దాడి



పరుగు తీస్తున్న పార్టీ శ్రేణులు, గ్రామస్తులు


- పరుగులు తీసిన కాంగ్రెస్ శ్రేణులు
- పలువురికి గాయాలు

పెద్దేముల్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ర్యాలీలో చిన్నపాటి అపశృతి చోటుచేసుకుంది. ఈ సంఘటన పెద్దేముల్ మండలంలో మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఇందూరు గ్రామంలో కాజ బందనవాజ్ దర్గా సమీపాన ఏర్పాటు చేసిన ఎన్నికల సమావేశంలో కాంగ్రెస్ తాండూరు అసెంబ్లీ అభ్యర్థి మనోహర్‌రెడ్డి ప్రసంగిస్తుండగా.. అభిమానులు బాణాసంచాలు కాల్చారు. తద్వారా వెలువడిన పొగకు చెట్టుపై ఉన్న జుంటు తేన టీగలు ఒక్కసారిగా పైకి లేచి, పార్టీ శ్రేణులపై దాడి చేయగా.. వాటిని తప్పించుకునేందుకు పరుగు తీశారు. తేనె టీగల దాడిలో గ్రామానికి చెందిన అంజిలమ్మ, యాదయ్య, రాచన్న, శేఖర్, నవాజీలు గాయపడగా.. చికిత్స నిమిత్తం బాధితులను తాండూరుకు తీసుకువెళ్లారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకగడా ఉందని ఆ పార్టీ నాయకులు తెలిపారు.

మీ బీసీ బిడ్డను.. ఆశీర్వదించండి

- బీజేపీ పరిగి ఎమ్మెల్యే అభ్యర్థి కిరణ్

కుల్కచర్ల: 'బీసీ బిడ్డగా మీ ముందుకు వస్తున్నాను. ఆదరించి ఆశీర్వదించండి' అని బీజేపీ పరిగి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మారుతి కిరణ్ అన్నారు. మంగళవారం ఎన్నికల పర్యటనలో భాగంగా చౌడాపూర్ మండలం కొత్తపల్లి, కల్మన్‌కాల్వ, మరికల్ గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ అగ్రనాయకత్వం బహుజనవాదాన్ని బలపరుస్తుందని, బీసీని ముఖ్యమంత్రిగా చేస్తామని ప్రకటించిందని కిరణ్ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు కమిటీ ఏర్పాటు చేసి, ఆ దిశగా వర్గీకరణకు మద్దతుగా నిలుస్తామని చెప్పిందని తెలిపారు. ప్రజలు ఒకసారి ఆలోచించి తమ విలువైన ఓటును సరైన వ్యక్తికి వేయాలని సూచించారు. నా ఒక్క ఓటుతో ఏమౌతుంది అనే ఆలోచన వీడనాడి, ఆ ఓటుతోనే బీజేపీ గెలుస్తుంది అనే భావనతో ఓటు వేయాలని అభ్యర్థించారు. పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు బంధయ్య, కుల్కచర్ల మండలం అధ్యక్షుడు మైపాల్ ఉన్నారు.



చౌడాపూర్ రోడ్‌షోలో ప్రసంగిస్తున్న కిరణ్